ఆకుపచ్చ చీర

వసుంధర

అప్పటికే కవిత అక్కడ చాలా చీరలు చూసింది.

ఆమెకు ఒక్కటీ నచ్చినట్లు అనిపించలేదు. సేల్సుమన్ ఓపికగా ఆమెకు అన్నీ చూపిస్తున్నాడు. ఆమె కొనడానికే వచ్చింది తప్పితే కాలక్షేపానికి రాలేదని సేల్సుమన్‌కు తెలుసును. చాలా తరచుగా ఆమె ఆ షాపులో బట్టలు కొంటూంటుంది. ఆ నగరంలో ప్రముఖుడైన చలపతిరావు భార్య ఆమె.

"మేడమ్—కలగజేసుకుంటున్నందుకు మన్నించండి. ఆ ఆకుపచ్చ చీర మీకు ఎంతో బాగుంటుంది—" అన్న గొంతు ఒకటి కవితకు వెనుకనుంచి వినబడగా ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది.

సుమారు ముప్పైఏళ్ళ యువకుడు. ఎత్తయిన విగ్రహం. ఒత్తయిన జుట్టు. కళ్ళలో మర్యాద కనబడుతోంది.

ఆమె అతణ్ని చూసి సిగ్గుపడింది. అప్రయత్నంగానే అతడు చెప్పిన ఆకుపచ్చ చీర వంక చూసింది. ఆమె

కళ్ళలోని మెరుపును కనిపెట్టి సేల్సుమన్ ఆ చీర మడతలు విప్పి చూపించాడు.

కవితకు ఆ చీర ఎంతో బాగున్నదనిపించింది. మరి తనకు ఇందాక ఎందుకు నచ్చలేదో!

ఆడదాన్ని ప్రభావితం చేయడానికి అపరిచిత యువకులు ప్రథమ సాధనాలు.

సేల్సుమన్ సమస్య తీరిపోయింది. అతడా చీరను ప్యాక్ చేయించాడు.

చీర గురించి ఆమెకు సూచించిన యువకుడామెను సమీపించి—"నా అభిరుచిని మన్నించినందుకు థాంక్స్" అన్నాడు.

"సెలక్షన్ లో సహకరించినందుకు నేనే మీకు థాంక్స్ చెప్పుకోవాలి!" అంది కవిత.

"నేనన్నానని అంటున్నారా లేక మనస్ఫూర్తిగా థాంక్స్ చెబుతున్నారా—" అన్నాడతను.

అతడంత సూటిగా అడిగేసరికి ముహమాటపడింది కవిత—"అయ్యో—అలా ఎందుకనుకుంటున్నారు?"

"అయితే నాకు మిమ్మల్ని ఈ చీరలో చూడాలని వుంది. ఆ అవకాశం కల్పించగలరా?" అన్నాడతను.

"అంటే?" అంది కవిత తడబడుతూ.

"రేపు సాయంత్రం అశోకా పార్కులో మీకోసం యెదురు చూస్తూంటాను. ఇలా అన్నందుకు నన్నపార్థం చేసుకోకండి. నేను చాలా మర్యాదస్థుణ్ని. మీరు వివాహిత అని నాకు తెలుసు...." అని అతడు చరచరా అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

2

కవితకు ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. "ఏమిటి అత గాడి ధైర్యం? బదులుకోసం కూడా ఎదురు చూడలేదు. తను వస్తానే అనుకుంటున్నాడా?"

కానీ అతడు ప్రత్యేకంగా చెప్పనే చెప్పాడు.... "నేను చాలా మర్యాదస్థుణ్ని. మీరు వివాహిత అని నాకు తెలుసు...."

అతడి మాటల్లో మర్యాద ధ్వనించింది.

వివాహిత అయిన స్త్రీ తనను గౌరవించి ఆరాధించే మగవాళ్ళను అభిమానించగలదు. కానీ తన శరీరాన్ని కాంక్షించే పరాయి మగవాడున్నాడంటే ఆ భావనే ఆమెకు కంటక ప్రాయమవుతుంది.

అతడి మంచితనాన్ని గురించి ముందామె మనసుకు నచ్చచెప్పుకుంటోంది. ఎందుకంటే అతడు ఎన్నిక చేసిన ఆ చీర కట్టుకుని అతడికి కనిపించాలని ఆమెకు కోరికగానే వుంది.

ఆ చీరలో భర్త తనను చూసి—"మార్వెలస్!" అన్నాడు. తను సిగ్గుపడుతూంటే—"ఈ రోజు సిగ్గు కూడా కొత్త అందాలు సంతరించుకుంటోంది. అంతా ఆ చీర మహోత్మ్యం—" అన్నాడు.

"అంటే నా అందమేమీ లేదా?" అంది కవిత.

"బంగారంలో రాళ్ళు పొదిగితే — బంగారానికే అందం వస్తుంది. కానీ అది బంగారం కాబట్టే అందం వస్తుంది. నేను మెచ్చుకుంటున్నది ఈ చీరను కాదు, నీ అభిరుచిని. నీ ఒంటికి ఏమేమి నప్పుతాయో నీకు ఇంత బాగా ఎలా తెలుసా అన్నది నా ఆశ్చర్యం. అందమైన శరీరం వుంటే చాలదు. దాన్ని అలంకరించుకోనడంలోనే

వున్నది అభిరుచి....” అన్నాడు చలపతిరావు.

ఆ అభిరుచి తనది కాదు. ఆ యువకుడిది. అతడు తన్నీ చీరలో చూడగోరాడు. అందులో తప్పున్నదా?

వున్నా తను ఉండనివ్వదు....

మర్నాడు సాయంత్రం ఆమె పార్కుకి వెళ్ళేసరికి అతడామెకోసం ఎదురు చూస్తున్నాడు.

“మీకు మరీ మరీ థాంక్స్!” అన్నాడతను.

“ఎందుకు?”

“నా మాట మన్నించినందుకు....”

కవిత ముఖం ఎర్రనయింది....“నేను మీ మాట మన్నించి రాలేదు. ఏదో పనుండి ఇలా వచ్చాను....”

“పోనీలెండి .... పనుండే వచ్చినా నేను చెప్పిన పార్కుకి నేను చెప్పిన సమయానికి నేను చెప్పిన చీర కట్టుకుని వచ్చారు. అదృష్టం ఇంతకంటె ఎక్కువగా ఎవరినీ కరుణించగలదనుకోను....” అన్నాడతను.

కవిత మాట్లాడలేదు. తనిప్పుడేం చేయాలీ అని ఆలోచిస్తున్నదామె. అతడు తన గురించి ఏమనుకుంటున్నాడో?”

“మీకు కుతూహలం తక్కువనుకుంటాను....” అన్నాడతను.

“ఏం?” అన్నదామె అప్రయత్నంగా.

“మీకు నేను అపరిచితుణ్ని. అలాంటిది నేను మీకు సరిపడే చీర గురించి ఎలా చెప్పగలిగాను?” అన్నాడతడు.

“ఈ చీర నాకు సరిపడిందని ఎవరన్నారు? అంది కవిత.

“మీరిలా ఈ చీరతో ఇక్కడ నిలబడి వుండగా—

ఎవరైనా గుడ్డివాడిక్కడికి వచ్చాడంటే—వాడిక్కూడా కళ్ళొస్తాయి—" అన్నాడతడు.

"అంటే?" అంది కవిత.

"అద్భుతమైన తన విశ్వరూపాన్ని సందర్శించే అవకాశమివ్వాలని పుట్టు గ్రుడ్డి అయిన ధృతరాష్ట్రుడికే కనులిచ్చాడు శ్రీకృష్ణుడు. ఇలాంటి సౌందర్యం దర్శించే భాగ్యం ఎవ్వరూ పోగొట్టుకోనరాదని ఆ సృష్టికర్తకు అనిపిస్తుంది—...."

కవిత సిగ్గుపడింది. అతడు పొగడ్తలతో తనను ముంచేస్తున్నాడు. ఎందుకు?

"మీకు కుతూహలం చాలా తక్కువ ..." మళ్ళీ అన్నాడతడు.

ఆమె మరుగ్గా అతడివంక చూసింది.

"నేను మీకీ చీర నెలా ఎన్నిక చేయగలిగానో ఆలోచించే ప్రయత్నం చేయడంలేదు మీరు...."

"చేశాను. తెలియలేదు—...." అంది కవిత.

"కుతూహలమే కాదు. జ్ఞాపకశక్తి కూడా తక్కువే మీకు...."

"అంటే?"

"ఒక్క క్షణం అలా కూర్చోండి—" అన్నాడతడు.

కవిత కూర్చుంది. ఆమెకు కాస్త దూరంగా అతడు కూర్చున్నాడు.

"ఇప్పుడు గతం గురించి ఆలోచించండి...." అన్నాడతడు.

"ఎందుకు?"

"ఈ చీరకు సంబంధించిన మీ గతంలో ఏమైనా సంఘటన ఉంటే గుర్తుకు వస్తాయి. అందుకు?"

కవిత ఆలోచనలో పడింది. ఈ యువకుడు తన వెంట బడడానికి ఏదో కారణముంది. ఇతడు తన గతం ప్రసక్తి తెస్తున్నాడు. ఏమిటా గతం?

ఆకుపచ్చ చీర....గతం....

తనకు వివాహమైంది....వివాహానికి ముందు....

ఉలిక్కిపడింది కవిత. అదే నా గతమంటే? అప్రయత్నంగా తలెత్తి అతడి ముఖంలోకి చూసిందామె.

అతడు నవ్వి—"మీకు శామ్యూల్ గుర్తొచ్చాడు కదూ—నేనతడి స్నేహితుణ్ని!" అన్నాడు.

కవితకు ఒక్కక్షణం నోట మాటరాలేదు. తర్వాత నెమ్మదిగా—"నాకు శామ్యూల్ గుర్తొస్తాడని మీకెలా తెలుసు?" అంది.

"చాలా తెలుసు నాకు. అయితే అన్నీ ఒక్కసారిగా చెబితే మీరు భరించలేరు. అందుకని ఒక్కటొక్కటిగా చెబుతాను. ఈ రోజుకిది చాలు. మనం మళ్ళీ కలుద్దాం" అని లేచి వెళ్ళిపోయాడతడు.

3

కవిత యింట్లో కూర్చుని శామ్యూల్ గురించే ఆలోచిస్తోంది. ప్రస్తుతం ఆమె మనసేమీ బాగాలేదు.

శామ్యూల్ యువకుడు. అందగాడు. ఓ సినిమాహాలు వద్ద తమకు పరిచయమైంది. పరస్పరాకర్షణ బయల్దేరింది. పరిచయం ప్రేమగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. ఇద్దరూ కలిసి ప్రేమ విహారాలు చేశారు. దూరంగా వున్నప్పుడు ఉత్తరాలు వ్రాసుకున్నారు.

తర్వాత ఈ ప్రేమ వ్యవహారం కవిత తల్లిదండ్రుల వరకూ వచ్చింది. కవిత తండ్రి మండిపడ్డాడు. ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదన్నాడు. ఈ పెళ్ళి చేసుకుంటే మళ్ళీ

కవిత ముఖం చూడనన్నాడు. ఆమె అన్నింటికీ సిద్ధపడింది.

అయితే శామ్యూల్ నిరుద్యోగి. ప్రేమించుకోవడం వరకూ బాగానే వుంది. కానీ ఆ తర్వాత బ్రతకాలికదా! ఏదైనా మంచి ఉద్యోగం దొరికేవరకూ పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యమతడికి లేదు. అదీగాక అతడికి చాలా ఇంటి బాధ్యతలున్నాయి. అతడికి దండిగా కట్నమిచ్చి, ఉద్యోగం కూడా వేయించడానికి ఓ ఆడపిల్ల తండ్రి సిద్ధంగా వున్నాడు. కవిత తండ్రి కూడా తనకలాగే సాయపడగలడని శామ్యూల్ ఆశించాడు.

"మన కొద్దినెలల ప్రేమ. కానీ మనవాళ్ళది ఎన్నో సంవత్సరాల ప్రేమ. మన ప్రేమ పేరు చెప్పి మన వాళ్ళను మనం దూరంచేసుకోరాదు—...." అని తీర్మానించాడు శామ్యూల్.

కవిత అతడిని ఎంతగానో ప్రాధేయపడింది. అతడంగీకరించలేదు. ఈలోగా కవిత తండ్రి త్వరపడి చలపతిరావు సంబంధం నిశ్చయం చేశాడు.

కవితకు పెళ్ళయిపోయింది. ఆరంభంలో ఆమె అదోలా వుండేది. కానీ చలపతిరావు మంచితనం, ప్రేమాభిమానాలు క్రమంగా ఆమెను ఆకట్టుకున్నాయి. ఆమె శామ్యూల్‌ను మరిచిపోయింది.

ఇన్నాళ్ళకు మళ్ళీ తను శామ్యూల్‌ను గుర్తుచేసుకోనవలసి వచ్చింది.

శామ్యూల్‌కు ఆకుపచ్చ రంగంటే ఎంతో ఇష్టం.

"ఇదివరలో నాకారంగంటే మక్కువలేదు. నీతో కలిపి చూశాక ఆరంగంటే మోజు బయల్దేరింది—" అనేవాడు శామ్యూల్!

అతడామెకు ఏదైనా బహుమతి ఇస్తే ఏదో విధంగా ఆకుపచ్చరంగు దానితో ముడిపడి వుండేది. ఏదీలేకపోతే ప్యాకెట్ కట్టడానికి ఆకుపచ్చరంగు రిబ్బన్ వాడేవాడు. అతడామెకు ఆకుపచ్చరంగు పెన్ను, ఆకుపచ్చ కాగితాల లెటర్ ప్యాడ్ ఇచ్చి-ఉత్తరాలు వ్రాయడానికి వాటినే ఉపయోగించుకోమని కోరాడు. అన్నింటికీ మించి ఆ రోజు....

ఆ రోజు ఇద్దరికీ అనుకోని ఏకాంతం లభించింది.

శామ్యూల్‌తో సినిమా చూసి అతడితోపాటు అతడి గదికి వెళ్ళిందామె. అలా చాలాసార్లు చేసింది గతంలో.

శామ్యూల్ ఓ గవర్నమెంటు క్వార్టర్లో వుంటున్నాడు. అది ఒక ఆఫీసరుది. ఇల్లు చాలా పెద్దది. అందుకని ఆయన అందులోని ఒక గదిని శామ్యూల్‌కి అద్దెకిచ్చాడు. అలా చేయడం నేరం. కానీ ఇలాంటి నేరాలు ఈ రోజుల్లో చాలామంది చేస్తున్నారు.

శామ్యూల్ కవితను ఆ యింట్లోని వారికి కూడా పరిచయం చేశాడు. వాళ్ళంతా స్నేహపాత్రులు. విశాల భావాలు కలవారు. కవిత రాకకు వారెటువంటి అభ్యంతరమూ చెప్పలేదు. అసలామె రాక గురించి వాళ్ళు పట్టించుకోనేలేదు. వీలున్నప్పుడు వాళ్ళూ వీరి మధ్యకు వచ్చేవారు.

అయితే ఆ రోజు ఆ యింట్లో శామ్యూల్, కవిత తప్ప ఇంకెవ్వరూ లేరు. ఇల్లంతా శ్యామూల్‌కు అప్పగించి ఇంటివారంతా ఊరికి వెళ్ళారు.

గదులన్నింటికీ తాళాలు వేసి వున్నా అది శామ్యూల్ మీద అపనమ్మకంతో కాదు. ఆ తాళాలన్నీ వారతడికే ఇచ్చి రెండేసిరోజులకోసారి ఇల్లు ఊడ్పించమని చెప్పారు.

ఆ రోజు శామ్యూల్ తాళాలన్నీ తీసి కవితకు గదులన్నీ చూపిస్తూ ఆఖరున పడకగదికి తీసుకుని వెళ్లాడు.

ఆ గది ఎంతో బాగున్నది. గదిలో దగ్గరగా జేర్చబడిన రెండు మంచాలు, వాటిమీద ఫోం బెడ్లు-మంచానికి దగ్గర్లోనే డ్రస్సింగ్ టేబుల్—ఆ టేబుల్ కు అందమైన నిలువెత్తు అద్దం .... గోడలకు శృంగారాత్మకమైన పెయింట్సు....

కవిత ఆ బొమ్మలను చూస్తూ పదిమంది తిరిగే ఇంట్లో అలాంటి బొమ్మలనెలా వుంచారా అని ఆలోచిస్తోంది. తమ యింట్లో పడకగది చాలా సింపుల్ గా వుంటుంది. ఆ గదిలోనూ మంచాలున్నాయి. డ్రెస్సింగు టేబులు వుంది. అయితే పడుకునేందుకు మంచాలవసరం కాబట్టి మంచాలున్నాయనీ, ముఖం చూసుకునేందుకు అద్దం అవసరం కాబట్టి అది వున్నదనీ అనిపిస్తుంది తప్పితే వాటి ప్రత్యేకత కనిపించదు.

ఈ గదిలో అలాకాదు. ప్రేయసీప్రియులు తమకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ప్రేమ మందిరంలా వున్నదది.

కానీ ఆ ఆఫీసరుకు వయసు నలభై అయినా వుంటుంది. అతడి భార్య ముప్పయ్యో పడిలో వుంది. ఇంట్లో ఎదిగిన పిల్లలున్నారు.

శామ్యూల్ ఆమె ఆలోచనలను చదివినట్లే వున్నాడు.

"ఈ గది పూర్తిగా భార్యాభర్తలది. పిల్లలకిందులో ప్రవేశం నిషిద్ధం. ఆఫీసరుగారు క్రమశిక్షణ విషయంలో చాలా ఖచ్చితంగా వుంటాడు. అయినా పిల్లలకూ్కడా ఒక్కసారి చెబితే చాలు...."

ఆ బొమ్మలు తను చూస్తున్నట్లు అతడు గ్రహించాడని

తెలియగానే కవిత సిగ్గుపడింది.

"సిగ్గెందుకు?" అన్నాడు శామ్యూల్.

"సిగ్గు కాదా మరి!" అంది కవిత.

శామ్యూల్ నవ్వుతూ—"రేపు నాకుద్యోగం వచ్చాక మన పెళ్ళి అయినాక—మన పడకగదిని ఇలాగే అలంకరించుకోవాలని వుంది నాకు. నీ అభ్యంతరమేమీ వుండదని ఆశిస్తాను—" అన్నాడు.

"ఛీ!" అంది కవిత.

"సరదాగా ఒక్కక్షణం మనమిద్దరమూ ఆ మంచం మీద కూర్చుందామా—" అన్నాడు శామ్యూల్.

"ఎందుకు?"

"జంటగా మంచంమీద కూర్చుని — మంచంమీద మన జంట ఎలా ఉంటుందో అద్దంలో చూసుకోవాలని వుంది—" అన్నాడు శామ్యూల్.

అతడలా అనగానే అదే కోరిక ఆమెలోనూ పుట్టింది. అయితే స్త్రీ సహజమైన అభ్యంతరాన్ని తెలియజేసినాకనే ఆమె అతడి కోరిక తీర్చింది.

ఇద్దరూ మంచంమీద కూర్చున్నారు. ఒకరి పక్కన ఒకరు. ఎదురుగా అద్దంలో ఒకరి పక్కన ఒకరు.

అప్రయత్నంగా శామ్యూల్ అన్నాడు—"మన జంట ఎంత బాగుంది?"

కవితకూ అదే అనిపించింది. తమ వివాహం త్వరగా జరిగిపోతే బాగుండునని ఆ క్షణంలో ఆమెకు అనిపించింది.

"అయితే జంటగా మనలో కొన్ని లోపాలున్నాయి" అన్నాడు శామ్యూల్.

"ఏమిటి?" అంది కవిత.

"జంటకుండవలసిన చనువు మనలో కనిపించడం

లేదు— ....”

“అంటే?”

“మనమిలా కూర్చుంటే ఇద్దరన్నా చెల్లెళ్ళు కూర్చున్నట్లుంది తప్పితే భార్యాభర్తలు కూర్చున్నట్లులేదు... ”

“భార్యాభర్తలెలా కూర్చుంటారో నీకు తెలుసా?” చిలిపిగా అడిగింది కవిత. ఒక్కోసారి ఆడవాళ్ళు ఎంత అమాయకత్వం ప్రదర్శిస్తారంటే అదే వారి పతనానికి దారి తీస్తూంటుంది. తన ప్రశ్నలోని చిలిపితనం కవితకు తెలియలేదు.

శామ్యూల్ ఆమెకు దగ్గరగా జరిగి — భుజంమీద చేయివేసి—ఆమెను దగ్గరగా తనవైపు అదుముకుంటూ— “ఇలా?” అన్నాడు.

అప్పటికి కవితకు తన పొరపాటు అర్థమయింది. అయితే ఆమెకు అతడికి దూరంగా జరగాలని కానీ— తన భుజంమీదనుంచి అతడి చేతిని తీసివేయాలనిగానీ అనిపించలేదు. ఆ దగ్గరతనమూ, అతడి స్పర్శా ఆమెకు ఏదో తెలియని కొత్త హాయిని స్తున్నాయి. అలాగే వుండి పోవాలనిపించిందామెకు.

అటువంటి సమయంలో మగవాడు కోరుకునేదదే. ఆడది మాట్లాడకుండా ఊరుకోవడం అతడికి వరం! శామ్యూల్ ఆ వరాన్ని వృధా చేయదల్చుకోలేదు. కాస్సేపట్లో ఇద్దరూ మరి కాస్త దగ్గరయ్యారు. అద్దం సంగతి ఇద్దరూ మరిచిపోయారు.

కొద్ది క్షణాల్లోనే ఆ చనువు మరింత పెరిగింది. శామ్యూల్ చొరవ చేస్తూంటే కవిత కాదనలేకపోతోంది. ఆ ఆశక్తత ఆమె వంటిమీదనుంచి చీరను తొలగించింది.

కవిత ఒకరకమైన సందిగ్ధావస్థలో పడింది. ఆమెకు

మనసులో భయంగా వున్నది. శరీరం మనసుకు ఎదురు తిరుగుతున్నది. అవునంటే తనకు అన్యాయం జరిగిపోతుందని భయం. కాదంటే అతడు తనను వదిలిపెడతాడని భయం. అతడి చనువు ఆమెకు బాగున్నది.

శామ్యూల్ మంచితనం, మర్యాద ఆమెకు తెలుసు. తన ప్రోత్సాహంలేనిదే అకడొక్క అడుగు కూడా ముందుకు వేయడు. వేయలేదు.

ఇక ముందు ఏం జరిగినా ఆ తప్పుకతడిని బాధ్యుడిని చేయలేదు. పూర్తి బాధ్యత తనదే అవుతుంది.

అతణ్ని వారించాలా, కూడదా?

కవిత ఆలోచిస్తూనే వున్నది. వున్నట్లుండి శామ్యూల్ ఆమెకు దూరంగా జరిగాడు—"నన్ను మన్నించు కవితా-చీర కట్టుకో!"

కవిత ఉలిక్కిపడింది. ఆ ఉలికిపాటులో నిరాశ కూడా వుంది.

కవిత మనసు ఆమె శరీరానికి అనుగుణంగా మారిపోతోంది. తానతడిని ప్రోత్సహించకపోయినా ప్రతిఘటించరాదని ఆమె నిర్ణయించుకుంది. అయితే తనకు తానై విరమించుకున్నాడు. ఏం జరిగింది?

"నావల్ల చాలా పెద్ద పొరపాటు జరుగవలసింది. సమయానికి నా కళ్ళు తెరుచుకున్నాయి...." అన్నాడు శామ్యూల్.

కవిత చటుక్కున చీర కట్టుకుంది.

"ఛీ—నువ్వెంత సిగ్గుమాలినదానివి—మగవాడికున్న పాటిముందు ఆలోచన నీకు లేకపోయింది—" అని మనసామెను తూలనాడింది.

అతడిలో ఆ క్షణంలో వచ్చిన మార్పు ఎందుకో

తెలుసుకోవాలని ఆమెకు అనిపించింది. కానీ ఎలా అడుగుతుంది?

ఇద్దరూ అక్కణ్నించి బయటపడ్డారు.

ఆ తర్వాత నాలుగు రోజులు ఇద్దరూ కలుసుకోడానికి ప్రయత్నించలేదు. ఆవేశంలో మనిషి ఏమేమో చేయాలనుకుంటాడు. ఆవేశం తొలగిపోయాక తాము చేయాలనుకున్నదానికి సిగ్గు, ఆశ్చర్యం కలుగుతాయి.

నాలుగు రోజుల తర్వాత శామ్యూల్ పార్కులో కలుసుకున్నాడు కవితను. ఆమెకు బహుమతిగా ఓ చిన్న ప్యాకెట్ తెచ్చాడు.

"నాకు ఉద్యోగం లేదు. అది వెతుక్కుంటూ ఈ ఊరొస్తే నువ్వు దొరికావు. నీకోసమైనా త్వరగా ఉద్యోగం సంపాదించాలని వుంది. అది సాధ్యపడుతుందనే ఆశిస్తున్నాను. ప్రస్తుతం నేను చిల్లర పనులు చేసి డబ్బు సంపాదించి రోజులు గడుపుతున్నాను. నా ఆదాయం అంతంతమాత్రం. అందువల్ల నేను పేదవాడిని. నా బహుమతి నా అంతస్తుకు తగినట్లుగానే వుంటుంది. కానీ దాన్ని నువ్వు నిరాదరణ చేయవద్దు. అంతస్తు ఎదిగాక నే మంచి బహుమతి ఈయవచ్చునుకదా—ఇంతలో తొందర ఏమొచ్చింది—అని అనుకోవద్దు. ఇది నీకు ఇవ్వడానికి ఓ పెద్ద కారణముంది. ముందు నేను నీకేమిచ్చానో చూడు—" అన్నాడు శామ్యూల్.

కవిత ఆత్రుతగా ప్యాకెట్ విప్పింది. అది.... ఆకుపచ్చరంగు చేనేత చీర! డిజైన్ ఎంతో బాగుంది. ఖరీదెంతో వుండదు. ఆపైన రిబ్బెట్లో కొన్నట్లున్నాడు.

"ఇది నాకు ఎంతో విలువైనది!" అన్నది కవిత చటుక్కున ఆ చీరను గుండెలకు హత్తుకుని.

"అవును నిజంగానే అది నీకు విలువైనది. అందుకే నేనది నీకోసం కొన్నాను. నీ శీలానికది రక్షాకవచంగా కూడా వుంటుంది—" అన్నాడు శామ్యూల్ ఆమె వంకే పరీక్షగా చూస్తూ.

"అంటే?" అన్నది కవిత అర్థంకాక.

"నాలుగురోజుల క్రితం మనమిద్దరం ఓ గదిలో ఉన్నప్పుడు—నీ వంటిమీద చీర లేనప్పుడు—నీ వంటిమీద వున్న లంగా రంగు ఆకుపచ్చ. నాలో ఆవేశం పెల్లుబుకుతున్నప్పటికీ ఆకు పచ్చరంగును నీ శరీరాన్నుంచి దూరం చేయాలన్న ఆలోచనే నాకు భయంకరంగా తోచింది. అప్పుడే నాలో వివేకం తలెత్తింది...." అన్నాడు శామ్యూల్.

కవితకు గుర్తువస్తోంది. సాధారణంగా బయటకు వెళ్ళేటప్పుడు తను అన్నీ మ్యాచింగు బట్టలే కడుతుంది. ఆ రోజు తను ఎర్రచీర కట్టుకుంది. ఎర్ర లంగా చాకలివద్ద వుండిపోయింది. అందుకని ఆకుపచ్చ లంగా వేసుకుంది. కానీ అదే ఆ రోజు తన శీలాన్ని కాపాడిందంటే—అందులోనూ తనుకూడా మానసికంగా, మనస్ఫూర్తిగా శీలాన్ని పోగొట్టుకోవడానికి సిద్ధపడినప్పుడు కాపాడిందంటే అది చాలా పెద్ద విశేషమే!

ఆ చీర కవితవద్ద ఇంకా వున్నది. దాన్నామె భద్రంగా దాచుకున్నది.

కవిత వెళ్ళి బీరువా తలుపు తెరిచింది. మూలగావున్న ఆ చీర తీసింది. ఆ చీరను చూస్తూనే ఆమె ఉలిక్కిపడింది.

అదామె కొన్న కొత్త చీరవలెనే వున్నది. డిజైన్లో మాత్రం చిన్న చిన్న తేడాలున్నాయి.

తన కోసమని కొన్న ఆ చీర డిజైన్ శామ్యూల్కు

ఇంకా అంత బాగా గుర్తున్నదా? అతడే ఉద్దేశ్యంతో తన స్నేహితుడని పంపాడు? ఇప్పుడేం జరుగుతుంది? శామ్యూల్ తనకు తానై తనను కలుసుకోకుండా తన స్నేహితుడినెందుకు పంపాడు?

అసలు శామ్యూల్ ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు?

4

"శామ్యూల్ గురించి ఆలోచించకండి—" అన్నాడతను.

కవిత ఫోన్‌లోకి చూసింది. దూరాన వున్న ఆ మనిషిని చూస్తున్నట్లుగానే వున్నదామె ముఖం—"మరి ఎవరి గురించి ఆలోచించమంటారు?"

"నా గురించి—...."

"మీ గురించా—ఎందుకు?"

"శామ్యూల్‌కు మీరు ప్రేమలేఖలు వ్రాశారు. అవి నా దగ్గరున్నాయి. శామ్యూల్ మీకు వ్రాసిన ప్రేమ లేఖల్ని ఆతడి ముఖాన కొట్టారు. అవీ నా దగ్గరున్నాయి. శామ్యూల్ మీతో పంచుకున్న అనుభవాల్ని డైరీలో వ్రాసుకున్నాడు. అవి నా దగ్గరున్నాయి. శామ్యూల్‌ని మీరెంతగా కాంక్షించినదీ మీరు డైరీలో వ్రాసుకున్నారు. అవీ నా దగ్గరున్నాయి. మీ గురించిన వివరాలు ఇన్ని నా దగ్గరుంచుకుంటే మీరు నా గురించి ఎందుకు ఆలోచించాలనడం హాస్యాస్పదంగా లేదూ!" అన్నాడతను.

కవిత శరీరంలో వణుకు పుట్టుకొచ్చింది. అతడు చెప్పేదంతా నిజమా? తను బ్లాక్ మెయిలింగు వ్యవహారంలో

ఇరుకొక్కబోతుందా?

"వీటి ఖరీదు లక్షరూపాయలు. అన్నీ ఒరిజనల్సు. మీ భర్తకు చేరకుండా అన్నీ మీకే అప్పగించేస్తాను.." మళ్ళీ అన్నాడతను.

"లక్ష రూపాయాలా" ఆమె నోరు తెరిచింది అప్రయత్నంగా.

"లక్ష రూపాయలని ఒక్కసారి నేనడంవల్ల మీకది చాలా పెద్ద మొత్తంలా అగుపించవచ్చు. కానీ సులభ వాయిదాల పద్ధతి ఒకటున్నది. నెలకు రెండు వేలు చొప్పున యాభై నెలలకు ఇమ్మన్నాననుకోండి — అప్పుడాలోచించి చూడండి — నేనడిగింది — ఎంత చిన్న మొత్తమో!" అన్నాడతను.

నెలకు రెండు వేలు! తన భర్త తనకు నెలకు రెండు వేలిస్తాడు—నీ సరదాలకు ఖర్చు చేసుకొమ్మని. యాభై నెలలపాటు ఆ రెండు వేలనూ ఇతగాడికివ్వాలా? ఆ రెండు వేలూ తనేం చేస్తున్నదీ భర్తకు చెప్పవలసిన బాధ్యత కూడా తనకున్నది. తన బాధ్యత తను నిర్వహించకపోతే ఏదో ఓ రోజున రహస్యం బయటపడవచ్చును. అప్పుడు భర్త తనను అసహ్యించుకుంటాడు.

"హలో....హలో...." అన్నాడతను.

"ఊఁ" అన్నదామె.

"మీరేమీ మాట్లాడడంలేదు...."

"ఏం మాట్లాడాలో తెలియడంలేదు...."

"నెలకు రెండు వేలు నాకివ్వలేరా?"

"ఇవ్వగలను..."

"అయితే ఊఁ అనండి...."

"నాకు కొంత వ్యవధి కావాలి...."

"ఎందుకు?"

"నా భర్తనుంచి రహస్యాలు దాచడం నాకిష్ట ముండదు. మీ కారణంగా ఇప్పుడాపని చేయవలసి వస్తోంది...."

ఫోన్‌లో అవతల నవ్వు వినిపించింది—"మీరు మీ భర్తకు శామ్యూల్ విషయం చెప్పారా?"

"లేదు...." అందామె విసుగ్గా.

"విసుక్కోకండి. మీరు మీ భర్తనుంచి రహస్యాలు దాచే అలవాటు లేదన్నారుగా—అందుకని అనుమానం వచ్చింది...." గొంతులో వెటకారం ఉంది.

అవును—శామ్యూల్ విషయం తను భర్తకు ఎందుకు చెప్పలేదు? తను చేసిన దాంట్లో తప్పేముంది? వయసు ప్రభావంతో ఓ యువకుణ్ని ప్రేమించింది. అతడిని పెళ్ళి చేసుకోవాలనుకుంది. కానీ అది సాధ్యపడలేదు.

ఇప్పుడు....

ఆ విషయం భర్తకు తెలియబరుస్తానని ఒకడు బెదిరిస్తున్నాడు.

నిజానికి తాను శారీరకంగా ఏ తప్పూ చేయలేదు. చేసిందనడానికి ఆధారమూ లేదు. కానీ వివాహానికి పూర్వం ఓ పురుషుడికి తానంత దగ్గరగా వెళ్ళిందంటే తన భర్త సహిస్తాడా?

"నాకు వ్యవధి కావాలి...." మళ్ళీ అంది కవిత.

"సరే—యిస్తున్నాను. కానీ ఇరవై నాలుగు గంటలు మాత్రమే! ఆ తర్వాత నేను మీనుంచి ఇంకేమీ వినదల్చుకోలేదు. రెండువేలు పుచ్చుకోవటం ఒక్కటే నేను చేయబోయేది...." అవతల ఫోన్ క్లిక్‌మంది.

కవిత రిసీవర్ని క్రెడిల్ చేసింది. చరచరా వెళ్ళి మళ్ళీ

బీరువా తలుపులు తీసింది. అందులోని లాకర్లో వున్నాయి తన డైరీలు.

కవిత లాకర్ తలుపులు తెరిచింది. ఆత్రుతగా వెతికింది.

ఒకే ఒక్క డైరీలేదు .... అందులోనే ఉన్నాయి తను శామ్యూల్ కలిపి గడిపిన ప్రేమ వివరాలు....

తను తప్పుచేయలేదు. కానీ భర్త నమ్ముతాడా?

అసలీ డైరీ ఎలా సంగ్రహించబడింది? ఆ లాకరు తాళాలను తానెంతో భద్రంగా దాచుకుంటుంది?

ఆలోచిస్తూంటే కవితకు గుర్తుకు వస్తోంది.

ఆ పని శామ్యూల్ చేశాడు. నిస్సందేహంగా శామ్యూల్ చేశాడు.

అయితే శామ్యూల్ తను చేసిన తప్పుకు విచారించలేదు. బాహాటింగా ఆ పని చేశాడు.

వివాహమైనాక తానింకా పుట్టింట్లో వుండగానే అతడు వ్రాసిన ఉత్తరం ఆమెకింకా గుర్తున్నది. అదింకా ఇప్పటికీ ఆమెవద్దనే వున్నది.

"నీతో పరిచయం నాకెంతో విలువైనది. నా అసమర్థతతో నేనది పోగొట్టుకున్నాను. అందువల్ల నిన్ను దేనికీ తప్పుపట్టను. అయితే నీతోటి అనుభవాలన్నీ నా డైరీలో పదిలంగా దాచుకున్నాను. నీ స్వదస్తూరీతో నీ డైరీలో మన గురించి వ్రాసుకున్న అనుభవాలు కూడా నా వద్దనే వుండాలన్నది నా కోరిక. ఆ కోరిక ఎప్పటికైనా ఎలాగో అలాగ తీర్చుకుంటాను. నీకు నామీద జాలివుంటే ఆ ఒక్క డైరీ నాకు పంపించు...."

తానా ఉత్తరాన్ని చింపిపారేసింది. ఆ డైరీని అతడికి పంపకూడదనే నిశ్చయించుకుంది.

ఉత్తరం వ్రాసిన వారం రోజులకు శామ్యూల్

వచ్చాడు.

"పెళ్ళయిపోయాక కూడా నా వెంటబడతావేం?" అంది తాను.

"నేను నీ వెంటబడను. నీ జ్ఞాపకాలు మిగుల్చుకుని నిన్ను మరిచిపోవాలనుకుంటున్నాను...." అన్నాడు శామ్యూల్.

"ఆ డైరీ నీకివ్వను...." అంది తను.

"ఒక్కసారి చూడనీ...." అన్నాడతడు.

కాసేపటికి జాలిపడి తానతడికి డైరీ చూపించింది. అతడు డైరీ చదువుతున్నప్పుడు తానక్కడలేదు. తను తిరిగి వచ్చేసరికి అతడక్కడలేడు. డైరీ మాత్రం ఉన్నదక్కడ.

సిమెంటు రంగు కవరు చూసి అది తన డైరీయేనని భ్రమపడింది. కానీ అది తనదికాదు.

శామ్యూల్ తెలివిగా డైరీ మార్చి వెళ్ళిపోయాడు. అప్పుడు తను పరీక్షించి చూడనైనా లేదు. అలాంటి అనుమానం తనకు రాలేదు.

ఆ డైరీలోని కొన్ని అనుభవాల్ని ఇద్దరూ చాలాసార్లు కలిసి చదువుకున్నారు. అతడి డైరీ తనకూ, తన డైరీ అతడికీ కవరు పేజీ రంగుతోసహా గుర్తుండి పోయాయి. అందువల్ల అతడికి తన డైరీ బాగా తెలుసు. అలాంటిదే మరొకటి ముందుగా కూడా తెచ్చుకుని ఆ మార్పిడిచేసి వుంటాడు.

తనకు వివాహం నిశ్చయం కాగానే ఆ డైరీని కొనసాగించకుండా వేరే మరో డైరీని ప్రారంభించింది. అందువల్ల మళ్ళీ ఆ డైరీలోకి చూసే అవకాశం కూడా రాలేదు.

ఇప్పుడు తన డైరీల్లో సిమెంట్ రంగు డైరీ ఒకటి ఎక్స్‌ట్రాగా వున్నది. కానీ అది తన డైరీ కాదు.

శామ్యూల్ ఎంత పని చేశాడు?

చివరికిప్పుడు బ్లాక్ మెయిలింగుకి దిగాడు!

అతడికి మొదట్నుంచీ ఇదే ఉద్దేశ్యమున్నదా? లేక పరిసితుల ప్రభావంవల్ల ఇలా మారాడా?

అతడికి తానంటే ఎంతో అభిమానం. తన మనసు కష్టపడే పని ఒక్కటీ చేసేవాడు కాదు. మాట అనేవాడు కాదు.

శామ్యూల్ కి ఎంతో సంస్కారం కూడా వుంది! అతడి కారణంగానే తన శీలం కాపాడబడింది.... ఈ సమాజంలో ఆడది, మగాడు ఏకాంతంగా వున్నప్పుడు... ఒక మగాడు ఆడదాన్ని తొందరపడకుండా ఆపడం సామాన్య విశేషం కాదు.

అలాంటి శామ్యూల్ ఈ రోజు బ్లాక్ మెయిలింగ్ కి దిగాడా?

ఆలోచిస్తూండగానే ఆ రోజు గడిచిపోయింది. రాత్రి అయిపోయింది.

ఇరవై నాలుగు గంటలు గడువిచ్చాడు శామ్యూల్ స్నేహితుడు.

పన్నెండు గంటలు అప్పుడే అయిపోయాయి.

కవిత భర్త కోసం ఎదురు చూస్తోంది. ఎదురుచూస్తూనే అతడు వస్తాడేమోనని భయపడుతోంది.

చలపతిరావు తనను ప్రాణంకంటె మిన్నగా ప్రేమిస్తున్నాడు. అలాంటి అతడినుంచి తనీ రహస్యం ఎందుకు దాచాలి? అందులోనూ తనేమీ తప్పు చేయలేదు కూడా!

కానీ..అతడు ఎన్నడూ తనను ప్రాణంకంటె మిన్నగా

ప్రేమిస్తూనే వుండాలని తనకున్నది. అందుకే రహస్యం దాచాలనుకుంటున్నది.

అప్పుడు .... నెలకు .... రెండువేలు .... అదీ భర్తకు తెలియకుండా ....

5

చలపతిరావు ఇంట్లో అడుగుపెడుతూనే నీరసంగా నవ్వాడు. తన బాధలో మునిగి వున్న కవిత ముందా విషయం గమనించలేదు.

"నీ భోజనం అయిందా?" అన్నాడతడు నీరసంగా.

"మీకోసం చూస్తున్నాను ..." అంది కవిత.

"నేను అనుకోకుండా బయట భోంచేసి రావలసి వచ్చింది...."

కవిత అదోలా నవ్వింది.

"నువ్వు భోంచేయి కవితా ...."

"లేదండీ—నాకాకలిలేదు...." అంది కవిత.

"కోపం వచ్చిందా?" అన్నాడతడు నీరసంగానే.

"లేదండీ—నిజంగానే ఆకలిగాలేదు. మీరు వచ్చినా మీకు భోజనంపెట్టి నేను సాయం కూర్చుందామనుకున్నాను...." అంది కవిత.

"అందుకే నువ్వంటే నాకెంతో యిష్టం. ఈ యింట్లో అన్నింటికీ నాకర్లున్నారు. కానీ మనిద్దరి మధ్యా ఎవ్వరినీ వుండనివ్వవు నువ్వు...." అన్నాడు చలపతిరావు.

"అవునండీ — మనిద్దరిమధ్యా యెవ్వరూ వుండడం నాకిష్టముండదు...."

చలపతిరావు ఇంకా నీరసంగానే—"కవితా—నీ ఇష్ట ప్రకారమే ఎల్లకాలమూ జరగాలని ఆ భగవంతుణ్ని ప్రార్థిద్దాం—" అన్నాడు.

"కవిత ఉలిక్కిపడి—"ఎందుకు?" అన్నది.

"ఏమో—ఈ అదృష్టం ఎల్లకాలమూ మనకుండ దేమోనని నాకు భయంగా వుంది—" అన్నాడు చలపతి రావు.

"ఏమయిందండీ...."

"కవితా — నేను కొన్ని చిక్కుల్లో పడ్డాను. ఈ నెలకు నీకు రెండు వేలూ ఇవ్వలేను. అయితే వచ్చే నెలలో మొత్తం నాలుగు వేలూ ఇచ్చుకోగలను...." అన్నాడు చలపతిరావు నీరసంగా.

"ఏమిటండీ—అలా నీరసంగా మాట్లాడుతున్నారు!" అంది కవిత. అయితే అతడన్న మాటలకామెలో కలవరం ప్రారంభమైంది.

భర్త ఇచ్చిన డబ్బుతో ప్రతినెలా ఆమె ఎంతో కొంత బంగారం కొంటూనే వున్నది. డబ్బును డబ్బుగా కాక బంగారంగా మార్చుకొనడం శ్రేయస్కరమని ఆమె అభిప్రాయం.

భర్త డబ్బివ్వకపోతే బ్లాక్ మెయిలర్ కివ్వడానికి తన వద్ద డబ్బుండదు. బంగారం అమ్మాలి....తనేంచేసినా భర్తకు తెలిసిపోతుంది. భర్తకు తెలియకుండా తాను ఖర్చుచేయగలిగింది ఆ రెండువేలూ మాత్రమే! తానెక్కడికి వెళ్ళినా—అందరూ భర్తకు పరిచయస్థులే! ఇంట్లో వున్న బంగారం గురించి భర్తకు తెలుసు. తన వంటిమీద బంగారంకాక మిగతా బంగారం కొంత బ్యాంకు లాకర్లోనూ, కొంత ఇంట్లో లాకర్లోనూ వున్నది. రెండు తాళంచెవులూ భర్తవద్దనే వుంటాయి.

బ్లాక్ మెయిలర్ తనకెంతో గడువివ్వలేదు.

"నాకు వంట్లో బాగాలేదు. మనసు కూడా బాగున్నట్లు

లేదు....” అన్నాడు చలపతిరావు నీరసంగా.

కవిత స్వయంగా భర్తను పడక గదిలోకి చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళింది. గదిలోకి చేరుకోగానే చలపతిరావు ఆమె చేయి విడిపించుకొని చటుక్కున తలుపులు మూశాడు.

“ఏమయిందండీ—....” అంది కవిత.

“నువ్వు నా చేయి పట్టుకోగానే నా నీరసం ఎగిరి పోయింది....” చిలిపిగా నవ్వుతూ అన్నాడు చలపతి రావు.

“ఊహూ....”

“ఈ ఆకుపచ్చ చీరలో నువ్వు నన్ను రెచ్చగొడు తున్నావు. నాలో ఉద్రేకం రేగుతోంది—” అన్నాడు చలపతిరావు మళ్ళీ.

కొద్ది క్షణాల్లో ఆమె వంటిమీద ఆకుపచ్చ చీరలేదు.

కవిత భర్త చేష్టలకు పరవశించటంలేదు. ఆమెకు శామ్యూల్ గుర్తుకు వస్తున్నాడు. ఆకుపచ్చ రంగును తన వంటినుంచి వేరుచేయడం ఇష్టంలేక అతడు తననే వదులు కున్నాడు. అతడి సౌందర్యారాధన అటువంటిది.

అసలైన ప్రేమ అదేనా?

భర్తకు తనపైన ఉన్నది కామం. కానీ శామ్యూల్ తనని ప్రేమించాడు. అయితే ఆ ప్రేమకు చివరికలా పరి శీలించింది? తన ప్రియురాలినుంచి ప్రతి నెలా రెండువేల రూపాయలాశించే స్థాయికి శామ్యూల్ దిగిపోయాడు.

రాత్రి పన్నెండు గంటలవరకూ చలపతిరావు ఆమెను మురిపించి అప్పుడు మళ్ళీ మరోసారి నిట్టూర్చాడు.

“ఏమయిందండీ?” అంది కవిత.

“ఈ రోజు జరుగకూడని విశేషం జరిగిపోయింది....”

"ఏమిటండీ అది!"

"నీకు లక్ష్మి తెలియదు కదూ—...."

"తెలియదు...."

"ఆమె వెంకటేశ్వర్లు భార్య...."

"వెంకటేశ్వర్లూ నాకు తెలియదు...."

"ఆయన ఊళ్ళో చాలా పేరున్నవాడు. నాకు ముఖ పరిచయం వుంది. ఆ భార్యాభర్తల ఆదర్శ దాంపత్యం గురించి ఊళ్ళో పెద్ద విశేషంగా చెప్పుకుంటారు. మన గురించి కూడా అంతా అలా చెప్పుకోవాలని నాకుంటుం దనుకో. కానీ మన గురించి బైటవాళ్ళకు తెలియదు. వాళ్ళు బయట కూడా తమ ఆదర్శ దాంపత్యాన్ని ప్రదర్శించేవారు. ఈ రోజు వాళ్ళు విడిపోయారు—...."

"విడిపోయారా?"

"అవును. అందుకు కారణం తెలుసా నీకు?"

"నాకెలా తెలుస్తుంది?"

"పోనీ ఊహించగలవా?"

కవిత ఊహించడానికి కూడా ప్రయత్నించలేదు. అలా ప్రయత్నిస్తూంటే ఆమెకు శామ్యూల్ గుర్తుకు వస్తున్నాడు.

చలపతిరావు చెప్పాడు — "కొద్ది నెలల క్రితం ఆయన ఆఫీసులో తన లేడీ సెక్రటరీ చేయిపట్టుకుని దగ్గరకు లాక్కున్నాడని ఆమె అంటుంది—"

"అయితే?"

"ఆ ఒక్క సంఘటన వారి మధ్యన వున్న ఆ న్నేళ్ళ అవగాహననూ జయించింది. ఆ రోజునుంచీ వారిమధ్య గొడవ ప్రారంభమైంది. ఇద్దరూ కోర్టుకెక్కారు విడాకుల కోసం. అయితే నిజంగా విడాకులు పుచ్చుకుంటారని

నేననుకోలేదు. రెండు వారాల క్రితం తెలిసింది—వాళ్ళు విడాకులు పుచ్చుకోబోతున్నారని...."

కవిత ఆశ్చర్యంగా—"వారిమధ్య ఇంకా ఏమైనా జరిగివుంటుంది...." అంది.

"అలా ఎందుకనుకుంటున్నావు?" అన్నాడు చలపతిరావు.

"భార్యాభర్తల అనుబంధం తెగిపోవడానికి మరీ అంత చిన్న సంఘటన కారణమా?" అంది కవిత.

"జీవితమంతా ఒకరికోసం ఒకరు బ్రతకాలంటుంది లక్ష్మి. ఎప్పుడైనా మనిషన్నాక బలహీనక్షణాల్లో మనసు చలిస్తే భార్యాభర్తలు పరస్పరం క్షమించుకోగలగాలంటాడు వెంకటేశ్వర్లు. నువ్వేమంటావ్?" అన్నాడు చలపతిరావు.

కవిత భర్తకేసి భయంగానూ, అనుమానంగానూ చూసింది. అతడీ ప్రశ్న ఎందుకడిగినట్లు? తన గురించి ఏమైనా తెలిసిందా?

"లక్ష్మి మాటే రైటు—" అన్నదామె.

చలపతిరావు నిట్టూర్చి — "ఆడవాళ్ళంతా అలాగే అంటారు. కానీ మగాడు తప్పుచేస్తే మళ్ళీ అందుకు ప్రోత్సాహమే కారణమవుతుంది—" అన్నాడు.

కవిత ఉలిక్కిపడింది. శామ్యూల్ని తనే ప్రోత్సహించినట్లు లెక్క! కానీ అతడు నిగ్రహించుకున్నాడు. అది తనకు బలహీన క్షణం....

"ఏది ఏమైనా పెళ్ళయినాక భార్యాభర్తల్లో ఎవ్వరూ బలహీన క్షణాలకు లొంగకూడదు—...." అంది కవిత.

"అంటే పెళ్ళికి ముందు లొంగవచ్చుననా నీ అభిప్రాయం?"

సూటిగా తగిలింది కవితకీ ప్రశ్న. ఒక్క క్షణం తడబడి—"ఈ విషయమై మీ అభిప్రాయం చెప్పండి" అంది.

"నా అభిప్రాయ మేమిటంటే బలహీన క్షణాల విషయమెలాగున్నా భార్యా భర్తల మధ్య రహస్యా లన్నవి వుండకూడదు. ఒకరి బలహీనతల నొకరికి చెప్పుకొని అవగాహన పెంచుకొని సమస్యలకు పరిష్కార మార్గాల నాలోచించాలి.

కవిత చటుక్కున-"నా దగ్గర మీకు తెలియని రహస్య మేదైనా వుంటే అర్థంచేసుకొని క్షమించగలరా?" అన్నది.

"నీ రహస్యాలు నాకు చెప్పుకోగలిగితే అది నువ్వు నాకిచ్చిన గౌరవంగా భావించి సంతోషిస్తాను. నీవద్ద ఎలాంటి రహస్యం దాగున్నప్పటికీ నేను నిన్ను వదులుకో లేను. నా ప్రాణంలో ప్రాణానివి నువ్వు...." అన్నాడు చలపతిరావు.

బ్లాక్ మెయిలర్ గురించి భర్తకు చెప్పేయాలన్నంత ఆవేశం వచ్చింది కవితకు ఆ క్షణంలో. అయితే అప్పుడే ఆమెకు తను చదివిన కథ ఒకటి గుర్తుకు వచ్చింది.

అందులో తనవంటి భార్య....

ఎటొచ్చీ తను తప్పు చేయలేదు. ఆమె తప్పు చేసింది.

ఆమె భర్త తన ఆదర్శాల గురించి పదేపదే చెప్పు కుంటాడు. భార్యలో ఎటువంటి తప్పున్నా క్షమించ గలననీ భార్యాభర్తల మధ్య రహస్యాలుండకూడదనీ అంటాడు. చివరికొకరోజున తను పెళ్ళికిముందు చిన్న పొరపాటు చేశాననీ—అది తన మనసును వేధిస్తున్నదనీ అంటాడు. భార్య కూడా ఏదైనా చిన్న తప్పు చేసి

వుంటే తన మనసుకు తృప్తిగా వుండేదంటాడు. ఆమెను దేవతలా చూస్తూ తానామెకు దూరంగా వుండడం ప్రారంభిస్తాడు.

భర్త పన్నిన ఈ వలలో భార్య పడిపోయింది. భర్త తన్ను తాను నిందించుకుంటూ అసంతృప్తితో బాధ పడడమూ, తనను దేవతలా చూడడమూ భరించలేక—ఆమె పెళ్ళికిముందు తను చేసిన తప్పు గురించి చెప్పేస్తుంది.

"నువ్విలాంటిదానివని చాలాకాలంగా అనుమానిస్తున్నాను. నీచేత ఈ నిజం చెప్పించడానికే ఇన్నాళ్ళూగా నాటకమాడుతున్నాను. నీవంటి కులట నాకు వద్దు—" అంటాడు భర్త.

అతడామెను వదిలిపెట్టేస్తాడు.

ఈ కథలోని నీతి ఏమిటో కూడా రచయిత్రి చివర చెప్పింది—"ఆడది తప్పుచెయ్యడం తప్పుకాదు. నీ భర్త తప్పును మన్నిస్తాడని నమ్మడం తప్పు...."

ఈ కథ గుర్తుకు రాగానే కవితకు బెంగపట్టుకుంది. చలపతిరావు తనను వెంకటేశ్వర్లు, లక్ష్మిల విడాకుల గురించి ఎందుకు చెప్పాడు? తనచేత నిజం చెప్పించడానికి అతను ప్రయత్నిస్తున్నాడా? అతడికి తనపై అనుమానం కలిగిందా? శామ్యూల్ గురించి అతడికి తెలిసిపోయిందా?

ఆలోచనలతో కవితకు నిద్రపట్టేసరికి చాలా ఆలస్యమయింది. చలపతిరావు ఆ రాత్రి కామెను పలకరించలేదు.

6

ఆ రోజు కూడా చలపతిరావు ఉదయం ఎనిమిది గంటలకే బయటకు వెళ్ళిపోయాడు.

సరిగ్గా పది గంటలకు కవిత గదిలో టెలిఫోన్

మ్రోగింది. ఆమె భయపడుతూనే రిసీవర్ తీసింది.

"గడువు అయిపోయింది—" అన్నాడతను.

"నేను నిర్ణయం తీసుకున్నాను. మీకు డబ్బివ్వాలని" అంది కవిత.

"చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు...." అన్నాడతను.

"కానీ ఈ నెలకు నేను మీకేమీ ఇచ్చుకోలేను. వచ్చే నెలనుంచి ప్రారంభిద్దాం...."

"వచ్చే నెలనుంచా? అదేమీ లాభంలేదు. ముందే చెప్పాను...."

"ప్రారంభం ఈ నెలనుంచే.... ఈ నెలకివ్వాల్సిన రెండు వేలూ బాకీగా అనుకోండి. వచ్చే నెలలో రెండు నెలలదీ కలిపి నాలుగు వేలూ ఇస్తాను...."

"నథింగ్ డూయింగ్...."

"ఈ విషయంలో నేను అసహాయురాలిని ..."

"అయితే ఈ రోజే మీ భర్తకు అన్నీ చెప్పేస్తాను."

"ప్లీజ్ ....అలా చేయొద్దు...."

"చాలాంబాగుంది. లక్షరూపాయలకు యాభై వాయిదాలివ్వడమే ఓ పెద్ద విశేషం. అందులో మళ్ళీ అప్పు కూడానా?"

కవిత అతడికి తన పరిస్థితి వివరించి చెప్పింది.

"అయితే ఓ పని చేయండి. మీకింకో ఇరవై నాలుగు గంటల వ్యవధి ఇస్తున్నాను. ఈలోగా ఆ రెండు వేలూ ఎలా సంపాదిస్తారో ఆలోచించుకోండి. రేపు ఉదయం పదిగంటలకు మీ దగ్గర నాకివ్వడానికి రెండు వేలూ సిద్ధంగా వుండాలి. లేనిపక్షంలో అంతే!" అవతల ఫోన్ క్లిక్ మంది.

కవిత ఆలోచనలో పడింది. తనకింక వ్యవధి లేదు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. విషయం భర్తకేనా చెప్పుకోవాలి. లేదా ఏదో విధంగా డబ్బు సిద్ధం చేయాలి.

లక్షరూపాయలు....

తను చేయని తప్పుకు మూల్యంగా అంత మొత్తం చెల్లించాలా? భర్తమీది అపనమ్మకంతో అంత డబ్బు పోగొట్టుకోవాలా?

కవిత మనసు ఉసూరుమంటున్నది.

అటు జీవితం....ఇటు లక్షరూపాయలు....

లక్షరూపాయల గురించి ఆమె మరీ అంతగా బెంగ పడడంలేదు. ఈ బ్లాక్ మెయిలర్ బాధ తనను జీవితాంతం వదలదేమోనని ఆమె భయం.

పిరికివాడికి వెయ్యి చావులు. ధైర్యవంతుడికొక్కటే చావు.

ఏదో ఒకటి అవుతుంది. భర్తకు విషయం చెప్పేస్తే.

మళ్ళీ ఆమెకు ఆ కథ గుర్తుకు వచ్చింది.

ఆలోచనలతో కవిత సతమతమవుతూండగా ఆమెను కలుసుకొనేందుకు ఒక యువతి వచ్చింది.

కవితకు ఆమె ఎవరో తెలియదు. అయినా మర్యాదగా పలకరించింది.

"నా పేరు రేఖ. కానీ నిజానికి మిమ్మల్ని మా అన్నయ్య కలుసుకోవలసింది—" అన్నదామె.

"మీరెవరో నాకు తెలియదు. మీ అన్నయ్య కూడా నాకు తెలిసివుంటాడని నేననుకోను—" అంది కవిత.

"అందుకే మా అన్నయ్య నన్ను పంపాడు. అనవసరంగా ఆడవాళ్ళపైన అపవాదులు రావడం అన్నయ్యకిష్టముండదు—...."

"విషయం చెప్పండి...."

"అన్నయ్య మీ ఇంటికొచ్చి మిమ్మల్ని కలుసుకుంటే అది ఎన్నో అపార్థాలకు దారితీస్తుంది. ఆడవాళ్ళ గురించి అన్నయ్య ఇంత మూర్ఖంగా ఆలోచిస్తాడు. దీన్నిబట్టి అన్నయ్య మంచితనం మీరు అర్థం చేసుకోవచ్చును..." అందామె.

"మీ అన్నయ్య మంచితనం గురించి నేనెందుకు అర్థం చేసుకోవాలో నాకు తెలియటంలేదు—...."

"ఎందుకంటే మా అన్నయ్య మీవారి గురించి ఏదైనా విశేషం చెబితే అది మీరు మీపట్ల సానుభూతిగా మాత్రమే అర్థం చేసుకోవాలి...."

"చెప్పండి...." అంది కవిత విసుగ్గా.

"ఇలాంటివి మాటల్లో చెప్పటం ఇబ్బందిగా వుంటుంది....ఇది చూడండి...." అంటూ ఆమె ఓ కవరు నందించింది కవితకు.

కవిత ఆ కవరునందుకుంది. అందులో నాలుగు ఫోటోలున్నాయి. అన్నింట్లోనూ ఒక యువకుడు, యువతి. ఇద్దరిమధ్యనూ ఎంత చనువున్నదో ఆ ఫోటోలే చెప్పక చెబుతున్నాయి.

ఆ ఫోటోలోని యువతి ఎవరో కవితకు తెలియదు. యువకుడు మాత్రం ఆమె భర్త చలపతిరావు.

కవిత చేతులు వణికాయి—"ఈ ఫోటోలు నాకెందుకిచ్చారు?"

"అన్నయ్యకు ఆడవాళ్ళంటే సానుభూతి. ఆ ఆడవాళ్ళను మోసగించే మగవాళ్ళంటే చిరాకు. పెళ్ళికి ముందు మీవారి చరిత్ర ఇది. పెళ్ళయినాక ఇంకా ఇలాంటి చరిత్ర ప్రారంభమైన దాఖలాలు లేవు. కానీ చెప్పలేం! మీరు మీవారిని ఆరాధిస్తున్నారు. ఆయన ఆ ఆరాధనకు

అర్హుడు కాడు. మీ మనసులో ఆయనకు సరైన స్థానం ఇవ్వటంకోసం ఈ ఫోటోలుపయోగిస్తాయి. వుంచుకోండి" అని చరచరా వెళ్ళిపోయిందామె.

కవిత చాలాసేపు ఆ ఫోటోలవంకనే చూస్తూండి పోయింది.

ఇదా తన భర్త చరిత్ర! ఇది ఈ రోజే తనకెందుకు తెలిసింది?

ఆమెకు అంతా అర్థమైనట్టే అనిపించింది.

మరొక్కసారి తను చదివిన ఆ కథకోసం వెతకాలను కుంది. ఎంత వెదికినా ఆమెకా పుస్తకం కనబడలేదు. ఆఖరికి భర్త వ్యాపార వ్యవహారాల మధ్య ఆమెకు దొరికింది ఆ పుస్తకం.

ఆ పుస్తకం అక్కడెందుకుంది?

సందేహంలేదు. చలపతిరావు ఈ కథను చదివాడు. ఆ కథ అతడిపై చెప్పుకోదగ్గ ప్రభావమే చూపింది. అతడికి భార్యపై అనుమానం ప్రారంభమైంది. అందు కోసం తనూ నాటకం ప్రారంభించాడు.

ఈ ఫోటోలు నిజమా—ఆ నాటకంలోని భాగమా?

ఏదిఏమైనా కవిత ఒక నిర్ణయానికి వచ్చింది. భర్తకు తన రహస్యం చెప్పాలన్నదే ఆ నిర్ణయం. అయితే తనకు తానై కాదు. ఆ బ్లాక్ మెయిలరునే ఆ విషయాలు చెప్ప నిస్తుంది. భర్త తనను నిలదీసి అడిగితే ఆ శామ్యూల్‌ని ఇక్కడకు రప్పించమంటుంది. మానసికంగా తనను హింసించిన ఆ శామ్యూల్‌ని కసితీరా తిడుతుంది.

అప్పుడు భర్త తనను వదిలిపెట్టాలనుకుంటే....

ఆత్మహత్య!

7

అతడు నెంబర్ డయల్ చేసి—"హలో!" అన్నాడు.

అవతలనుంచి—"నేను కవితను. మీరెవరు?" అన్న గొంతు వినిపించింది.

"నేను శామ్యూల్ స్నేహితుణ్ని—" అన్నాడతడు.

"అయాం సారీ మిస్టర్! నేను మీకు డబ్బిచ్చుకోలేను. మీరేం చేయాలనుకుంటే అది చేసుకోనవచ్చును."

అవతల క్లిక్ మంది.

అతడి కళ్ళలో ఆశ్చర్యం కనబడింది. తనూ రిసీవర్ క్రెడిల్ చేశాడు. తర్వాత జేబులో చేతులు పెట్టుకుని లేచి నిలబడ్డాడు.

కొద్ది క్షణాల్లోనే అతడు రోడ్డుమీద వున్నాడు. మరికొద్ది క్షణాల్లో చలపతిరావు ఎదుట వున్నాడు.

"ఆమె డబ్బివ్వడానికి నిరాకరించింది" అన్నాడతడు.

చలపతిరావు కళ్ళు మెరిశాయి-"రియల్లీ!" అన్నాడు.

"అవును...."

"థాంక్యూ మై డియర్ ఫ్రెండ్...." అన్నాడు చలపతిరావు.

"నేను మీ స్నేహితుణ్ని కాదు. శామ్యూల్ స్నేహితుణ్ని!"

చలపతిరావు అతడికి, శామ్యూల్ కు మరోసారి తన కృతజ్ఞతలు తెలియజేశాడు. అతడు వెళ్ళిపోయాడు.

చలపతిరావు ఆలోచిస్తున్నాడు.

తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నాడు కవితను. ఎట్టి పరిస్థితిలోనూ ఆమెకు దూరమై బ్రతుకలేడు. అయితే పెళ్ళికి ముందు బలహీన క్షణాల్లో తానో చపలచిత్త అయిన యువతి వలలో పడ్డాడు. అది తాత్కాలికం

మాత్రం. ఎప్పుడో ఆ వ్యవహారం కవితకు చెప్పి ఆమె క్షమను పొందాలనుకున్నాడు. కానీ ఈలోగా వెంక టేశ్వర్లు, లక్ష్మిల ఆదర్శ దాంపత్యం కోర్టుకెక్కింది.

ఆడది భర్తని ఎంతగా ప్రేమించినా, భర్తచే ఎంతగా ప్రేమించబడుతున్నా-ఒకోసారి చిన్న చిన్న విషయాల్లో ఎంతైనా మూర్ఖంగా ప్రవర్తించి నూరేళ్ళ సంసార జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసుకోగలదని లక్ష్మి బుజావు చేసింది.

లక్ష్మి కేసు కోర్టులో నడుస్తూండగానే తనపైన బ్లాక్ మెయిల్ ఆరంభమయింది. చలపతిరావుకు కవితపై నమ్మకం పోయింది.

ఏం చేయాలి?

కవిత తన్ను చీదరించుకుంటే....

మన దేశంలోని ఆడది మానసికంగా ఇంకా ఎదగ లేదు. కవిత ఎలాంటి తప్పుచేసినా తను భరించడానికి సిద్ధంగా వున్నాడు. కానీ ఆమె అలా వున్నదో, లేదో..

చలపతిరావుకు శామ్యూల్ గురించి చూచాయగా తెలుసు. అతడు కవితను పెళ్ళిచేసుకోవాలనుకున్నాడనీ.. కవిత తండ్రి అందుకంగీకరించలేదనీ....

అతడు శామ్యూల్‌ను కలుసుకున్నాడు. తన పరిస్థితిని, లక్ష్మి గురించిన విశేషాలు చెప్పాడు.

"మిమ్మల్ని కవిత ప్రేమించినదీ లేనిదీ నాకు తెలియదు. ప్రేమించి వున్నప్పటికీ అది గతంలో మాత్ర మేనని నాకు తెలుసు. నన్నామె సానుభూతితో అర్థం చేసుకోవాలంటే మీరామెను బ్లాక్ మెయిల్ చేయడం మినహా మరోదారిలేదు. మీరామెనెలా బ్లాక్ మెయిల్ చేస్తారో కూడా నేను తెలుసుకోనదల్చలేదు. ఒకప్పు

డా మెను ప్రేమించిన వ్యక్తిగా ఈరోజా మె సంసారం చక్కదిద్దండి...."

ముందు అంగీకరించకపోయినా చివరికి శామ్యూల్ అంగీకరించాడు. తన స్నేహితుడిని పంపాడు.

ఇప్పుడేం జరుగుతుంది? నిన్న రేఖ తనను బెదిరించింది. ఫోటోలా మెకు అందజేస్తానని! అందజేశానని కూడా ఆ తర్వాత ఫోన్ చేసి చెప్పింది.

ఫోటోలా మెకు అందాయా? అందితే ఆమె రియాక్షన్ ఏమిటి?

* * *

ఇంట్లో భర్తకోసం ఎదురుచూస్తూ కవిత ఆలోచిస్తోంది. బ్లాక్ మెయిలర్ భర్తకు అన్నీ చెప్పేశాడా? భర్త ఇప్పుడు తన గురించి ఏమనుకుంటున్నాడు? అతడు వచ్చి తనను నిలదీస్తే తను ఏం చేయాలి? ఈ ఫోటోలు చూపించాలా?

తనాశించినట్లుగానే ఆ సాయంత్రం భర్త రాగానే బ్లాక్ మెయిలర్ విషయం చెప్పాడు. అతడు శామ్యూల్ విషయం చెప్పి, కవిత ఉత్తరాలు, డైరీ చూపించినట్లు, తను వాటిని అతడి మొఖానే కొట్టి బాగా చీవాట్లువేసి పంపినట్లు, చెప్పాడు....

కవిత హృదయం తేలికపడింది. భర్త ఔన్నత్యానికి, అతడికి తనమీదున్న నమ్మకానికి, ప్రేమకి కరిగిపోయింది.

ఆ తర్వాత ఏళ్ళు గడిచాయి.

ఫోటోల గురించి కవిత భర్తను అడగనేలేదు.

వారి దాంపత్యంలోని అన్యోన్యత మాత్రం చెక్కుచెదరకుండా వున్నది.

—:అ యి పో యిం ది:—